# విధి తిప్పే గానుగ

(కథానిక)

సుడిగుండంలా గానుగెద్దు తిరుగుతోంది.

ఎద్దు తుమ్మమొద్దులా, పొగ చూరిన గోడలా నల్లగా తట్లు తేలి పేగ ఎముకలు పైకి తన్నుకురాగా, వెన్నెముక కావిడి బద్దలా వంగి పోగుపెట్టిన ఎముకల గుంపుమాదిరిగా గానుగను లాగలేక లాగుతోంది. నువ్వ గానుగను బలవంతంగా తిప్పుతోంది. ఒకక్షణమైనా ఆగకుండా భూమిమల్లే తిరుగుతోంది.

దానితో సుడిగుండంలో పడ్డ పడవలాగ కామరాజు అంకుశంతో తెలగపిండి పెల్లగిస్తూ తిరుగుతున్నాడు.

నిజంగా కామరాజు పేద జీవితంలో సుడి తిరిగిపోతున్నవాడే. ఎంత నూనాడినా రోజుకు రూపాయి డబ్బులు మిగలకపోతే చస్తాడా?

అణా పైసలతో అక్కడ కక్కితేగాని, షావుకారు నువ్వుల బస్తా ఇవ్వడు. డబ్బుకోసం మార్వాడిదగ్గరకి పరుగుపెట్టాలి. పెళ్ళాం పుస్తెలు తాకట్టుపెట్టాలి. ఇంతకూ వడ్డీ మహా దారుణంగా రోజుకి రూపాయికి అణా చొప్పున పాపం పెరిగినట్టు పెరుగుతూంది. నువ్వులు బస్తా ఆడేటప్పటికి ముత్తాతలు కలలో కనిపించి, ఆశ్వీరదిస్తారు. కామరాజు ఈ పెను తుఫానుకి తట్టుకోలేక, సుడిగాలుల్లో కొట్టుకుపోతున్నాడు. అంతూ దరీ లేని అగాధంలో పడిపోతున్నాడు.

ఇంట్లో కుటుంబానికి తిండిపెట్టాలి. ఎద్దుకి తిండిపెట్టాలి. తను తినాలి. ఇంతమందికి మొక్కి సాగిలబడేసరికి అతనికి కంఠగత ప్రాణమయేది. ఇలాంటి సమయాల్లో భార్య గాని ఏమాత్రం సహకరించక పోయినా సన్యాసాశ్రమ స్వీకారం చెయ్యాలిసిందే! కామరాజు భార్య నూకాలు అతని జీవితానికి టీకా తాత్పర్యంగానే మసల సాగింది. ఇద్దరు సంతానంతో అవకతవకలుగానే నడుస్తున్నాడు కామరాజు.

కామరాజు ఎద్దుని జాగ్రత్తగానే తిప్పుతున్నాడు. దరిద్ర్యాన్ని గురించి ఆలోచ నతన్ని సుడితిప్పుతోంది. ఇంతలో కాడి కట్టు ఠఫీమని తెగిపోయింది. కాడి యెద్దు కొమ్ముల్లో చిక్కుకుని, గిజగిజలాడించింది. కామరాజు హైఁమని లేచివచ్చి కట్టు కదిలించేడు. ఎద్దు తోడ త్రొక్కిడిగా చిందులేస్తోంది. కాడి తగిలించి, కట్టబోయేసరికి గిజాయించి లాగేసింది. దానితో కామరాజు పాడుగోడ కూలినట్టు పడ్డాడు. నడుం విరిగేంత పనైంది. నెమ్మదిగా లేచి, ఎద్దు కళ్ళకి గంతలు విప్పి, దొడ్లోకితోలిపెట్టాడు. ఎద్దు ముక్కు రంధ్రాల్లోంచి బుసలుగొడుతూ, నంది విగ్రహంలా కదిలింది. ఆరబోసిన నువ్వుపప్పుమీద తెగబడింది. నూకాలు, "ఓస్! దీని జిమ్మడ దొమ్మొచ్చింది దీనికి" అంటూ కర్ర గిరేసింది.

"ఆ కర్రెద్దు పోడంతోనే మన మాలచ్మి యెల్లిపోయింది. దీన్తో వచ్చింది శనిగ్గహం"

నూకాలు అందుకుంది,

"దాని పాళాన అడిపోయింది. కొన్నెద్దునన్నా వుంచావా? తెగ నమ్ముకున్నావ్. దాని సాటిదేని కొత్తది. అది ఆడుగడ్డంతోనే, రోజుకి మారాజులా డబ్బొచ్చేది. ఇప్పుడు శనిగ్గహం తగులుకొంది."

ఎద్దు చెవులు రిక్కించి, కళ్ళు తిండ్రించి, చూస్తోంది.

* * *

కామరాజు పెట్టిపుట్టని పేద. తనకులంలో జీవవృత్తి చేసుకుంటూ, ఒకర్ని యాచించని, జీవితం గడుపుకొన్నాడు. తండ్రి తాతలు వెలిగించిన దీపంలో తాను సయితం నూనె పోశాడు. ఆ నూనే ఇప్పుడు కరువయ్యింది. తండ్రి సంపాదించిన ఆస్తితో వెలిగించిన జ్యోతి, విచ్చలవిడిగా కిరణాలు వెదజల్లుతూ, కామరాజు తొక్కింది రూపాయిగా, పట్టింది

దొగిపర్తి వెంకటరమణ

పసిడిగా చేయగలిగింది. ఆనాడు పెద్ద యెత్తు మీద రెండు గానుగులుండేవి, విధి విరామం లేకుండా, గానుగ కిర్రులు వినిపిస్తూనే వుండేవి. నాలు గెద్దులతో గాను గాపకుండా. కొడి మార్చి, బస్తాల కొలది నూనె ఆడేవాడు. ఆనాడు తన నాశ్రయించుకుని తన బావమరది, యెవడో ఊరూ, పేరూ లేని దూరపు చుట్టం తన యింట్లోనే, ముప్పొద్దులా మూడు, మూడు కంచాలు చెల్లించి, చుట్టలు వెలిగించేవారు. అప్పుడు తన కొడుకు చక్రాయి, యెత్తిన భుజం దిగకుండా, మట్టి మీద కాలు పెట్టేవాడు కాదు. నూకాలు మోకాలు వంచి, కూచోనక్కర లేకుండానే సర్వం జరిగిపోయేవి. అప్పుడన్నా కొమరాజు గానుగెక్కి కట్టెద్దుని తిప్పాడంటే, శేరు నువ్వుపప్పుకి, రెండు శేర్ల నూనె రావాలిసిందే!

దానితో తండ్రితాతలు వెలిగించిన జ్యోతిలో చమురు అవిరతంగా ధారలు కట్టేది.

దానితో అతను ఒక మెట్టు పైకెక్కేడు. మహాలక్ష్మి ఏ శుక్రవార సుముహూర్తపు వేళ అడుగు పెట్టిందో కాని, వెలుగు జిలుగులు చిలికింది అతని జీవితం.

పాలెంలో పెద్దరైతు రామిరెడ్డి. పిలిచి పిల్ల నిచ్చినట్టు ఐదెకరాల తేనెమాగాణి మక్తా కిచ్చాడు. దానితో కొమరాజు పొలం గట్టు మీదికి చౌకళించి, విజయాట్టహాసం చేసేడు. పంటలు బాగా పండి, మక్తా డబ్బుపోను, అయిదారు వందలు మిగిలాయి.

కట్టెద్దుని వ్యవసాయంలోకి మళ్ళించేడు. కట్టెద్దు కాడెత్తి, పొలం దున్నుతూంటే అమృతం ఊటలూరేది.

ఆయేటి పంట మళ్ళీ యేటిపంటతో కొమరాజు కళ్ళు, ఆకాశంలో నక్షత్రాలు లెక్కింప సాగాయి. కన్ను మిన్నెరుగని కన్నెవలపుల మల్లే, ప్రపంచం కుటుంబం అనేవి వున్నాయా అన్నైనా తలచలేకపోయేడు.

జ్యోతిః తేజో కాంతి అపరిమిత మవడం తోనే కన్నులు మిఱుమిట్లు గొలిపి, ఏమీ కనిపించలేదు. జగత్తంతా లీలావస్తువుకింద కనిపించింది. తాను వేలమీద నాయకుడయ్యాడు. ఏనుగలాగ కట్టెద్దు గానుగ లాగుతూంటే, భూమీ మండలి అతని కళ్ళముందు గిర్రున తిరుగుతున్నట్టు కనిపించింది.

ఒక గానుగ తిరిగితే రోజుకి నాలుగైదు రూపాయలు తేలిగ్గా చేతిలో పడేవి. దానితో మూడుముళ్ళ సంసారాన్ని ముచ్చటగా, విలాసంగా ఈదవచ్చు.

నూకాలు తమ సంసారం బాగుపడ్డానికి కట్టెద్దే మూలకందమని, దాని కళ్ళలో ఈశ్వరుడున్నాడని, గాఢంగా, మూఢంగా విశ్వసించింది.

కట్టెద్దు తక్కిన పశువులన్నీ ఒక్కోరోజు మేతకెళ్ళేవి. ఒకరోజున పొలంలో మేస్తున్నాయి. కట్టెద్దు నిలిచినచోట నిలవక, చిందులు తొక్కుతోంది. పరమోత్సాహంతో అంగలు వేస్తోంది. కళ్ళలో అమాయికంగా నవ్వుకుంటూ, ముక్కు రంధ్రాల్లోంచి, గాఢశ్వాస ప్రసరిస్తూ తుప్పల్లోకి పరుగులు పెట్టింది.

పొదలమాటు పుట్టల్లో అడుగులేస్తోంది. ఒక పెద్ద పుట్ట. ఆ పుట్టమీద తన మహాభారమైన గిట్టల్ని ఆనించింది. నాగరాజు కోపం పట్టలేకపొయ్యాడు. బుసలు కొట్టుకుంటూ, కాటు వేశాడు. కట్టెద్దు ఆగక, ఆగలేక పరుగు లంకించుకొంది.

ఆ పెద్దబరువు పరుగెట్టలేకపోయింది. నేల మీద పడి, గిజగిజ తన్నుకుంది. చొంగలు కార్చుకుంటూ నేల రాలిపోయింది. లేవబోయింది. నాగరాజు కాటు లేవనీయ లేదు.

కట్టెద్దుతో కొమరాజు ఐశ్వర్యం విరమించుకుందంటే ఆశ్చర్యం లేదు. అయినా ఆ పోలికల ఎద్దే మరొకటి వాళ్ళకి దొరికింది. ఆ ఎద్దు కూడా కట్టెద్దు మల్లేనే, ఒకే అచ్చులో వ్యక్తమయింది. దానితో ఐశ్వర్యం నిలబడుతుందా?

కొమరాజుకు పొలంలో కాలు పోయింది. పిలిచి ఇచ్చినాయనే ఇప్పుడు పిలిచి పొమ్మన్నాడు. కొమరాజు సరే నన్నాడు.

కొమరాజు కట్టెద్దు చచ్చిపోయినందుకు నూకాలులా విచారించనే లేదు. ఏదో పోతే పోయినట్టు ఊరుకున్నాడు.

డబ్బు కావలసినంత చేతిలో మోత పెడుతున్నపుడు, పెడబుద్ధులు పుట్టకుండా ఉండవు. అది ఖర్చయిపోవాలి. తాత్కాలిక సౌఖ్యం అనుభవించాలి.

పక్కపక్క స్నేహితులు పోగై, జేబులు దులిపేసేవారు. "ఉన్నపుడు తినక ఎప్పుడు తింటాం? ఇవ్వాలిటిరోజు రేపొస్తుందా? ఏది నిత్యం? ఉన్నది అనుభవించి తీరాలి" అనే సిద్ధాంతాలు సలహాలు కామరాజుకి బాగా నచ్చాయి. దానితో తనకి త్రాగుడు వేలిగ్గా అలవాటయింది. అది నిషేధింపబడినా అతను త్రాగటం మానలేదు. అతనసేవింటి? ఎవరూ మానలేరు! బహిరంగంగా తాగేది కొంచెం తెర మరుగులో అవినీతిగా తాగుతున్నారు. సారా, కాసేవాళ్లు కాస్తూనే వున్నారు. తాగేవాళ్లు తాగుతూనే వున్నారు, వాళ్ళని పట్టేవాళ్లు పడుతూనేవున్నారు. రోజుకి పది పన్నెండు కేసులు పడుతూనేవున్నారు. జరిగేది జరుగుతూనే వుంది.

ఎందుకు? బ్రాందీ, విస్కీలు హైక్లాస్ త్రాగుళ్లు తాగేవారిని ఏ మహానుభావుడు పట్టుకున్నాడు చెప్పండి! వాళ్ళంటే ధనదేవతలు! తాగొచ్చు తందనాలు తొక్కొచ్చు. పట్టుకునే వాళ్ళకి గుండె బలంలేదు.

ఇంతకూ కామరాజు త్రాగుడేకాక పేకాట కూడా మొదలుపెట్టాడు. ఆట రాకపోయినా, డబ్బుమాత్రం దోసిళ్ళ కొలది పోసేసేవాడు. దీని కంతకీ కారణం తన ధన మదాంధత కావచ్చు. తన అవివేకం కావచ్చు. భార్య నగలు నాణ్యాలు సానివాడలో మెరుస్తున్నాయి. పెళ్ళాం బిడ్డలు అలోమని ఏడ్చినా లెక్కలేకపోయింది.

అప్పుడు నూకాలు, చక్రాయిని, కూతురు వెంకిని వెంటేసుకుని పుట్టింటికి దారి పట్టింది. దీనితో కామరాజుకి శనివిరగడైనట్టు కనిపించి, ఇంటిదగ్గరకే తెచ్చేసేడు సానివాడ నంతటినీ.

ఎవరికీ చెప్పకుండా బావమరది అప్పుడే యెక్కడికో పారిపోయాడు.

సంపాదించి, ధనం కూడబెడితే తరగదుగాని రోజు పాతికాపరకా తీసేస్తే, నాలుగునెలల్లో దమ్మిడీ కనిపించలేదు. ఇల్లంతా గుల్లయిపోయింది. గృహలక్ష్మి లేని యిల్లు పెళపెళలాడింది. దిక్కుతోచక కర్రెద్దు నమ్మేసేడు. ఇంట్లో కుండ పెంకులు మిగిల్చాడు.

నూకాలు పుట్టింటినుంచి దిగి చూచింది. ఏవుంది? మూరంలో దుప్పటి తన్నిపెట్టుకొని, మూలుగుతూన్న కామరాజు కనిపించేడు. మూలుగుతూ లేచేడు. ఆవేళ ఇంట్లో నూకగింజలుకూడా లేవు.

"ఇల్లంతా గుల్లసేసేవా?"

"..................."

"ఇలాంటి దరిద్రగొట్టోళ్ళకి అయిశ్వర్యం నిలబడ్డేటి?"

"...—......"

"మాయదారి మాలచ్మి మనింటి కెందుకొచ్చిందో?"

"............"

"మనమొగాలికి డబ్బుగూడా నిలుత్తదా?"

"............"

"ఎద్దు నమ్మేసేవ్. ఇక రెండుసేతుల్తో కూడు తిందాం"

కామరాజుకి మాటలు శూలాల్లా గుచ్చుకుంటున్నాయి. అపరాధం చేసిన పిల్లవాడిలా, కిక్కురుమనకుండా కూర్చున్నాడు. చేతులారా చేసుకున్న కర్మ! డబ్బయిపోతున్నదనైనా తనకి తోచనేలేదే! కళ్ల నీళ్లు కుక్కుకంటూ ఆనాడు చక్రాయిగాణ్ణి తనవాళ్లు, పెరవాళ్లు, ఎత్తుకు దింపకుండావున్న దృశ్యాలు, కడుపునిండా కూడుతిని, సుఖించే ఘట్టాలు— కలలు కంటున్నాడు.

"ఆడికేం మా రాజు! కామరాజంటే దర్జాకి రాజురా!" అనేవారు తన కులంవాళ్లు పూర్వం.

తన తండ్రి తాతలు వెలిగించిన జ్యోతిలో, తాను సహితం ఇదివరలో చమురు పోసేడు. ఇప్పుడు చమురు కాదుగదా కన్నీటిధారలు పోస్తున్నాడు. ఉండడానికి గూడు తప్ప మరోటిలేదు!

* * *

చక్రాలతో ఆడుకున్న చక్రాయి, ఇపుడు ఫ్యాక్టరీలో పెద్దపెద్ద మిషన్ చక్రాలతో ఆటలాడుతున్నాడు. ఇంటో నువ్వుల గానుగని ముసిలెద్దు తిప్పాతోవుంది. కూతురు వెంకి గానుగ మీదెక్కి, అంకుశంతో తెలగపిండి పెల్లగిస్తూ, బుట్టలో వేస్తూంది. నూకాలుకి జబ్బుగా వుండడంచేత గదిలో పడుకుని ఉంది

వచ్చే డబ్బంతా నూకాలు మందులికీ మాకులికీ సరిపోతోంది. సాయిబుగారి సంపాదన బీడీ కట్టు పొగులికే!

వెంకి గానుగ తిప్పుతోంది.

కామరాజు కళ్లు నీళ్లు కురుస్తున్నాయి.

"ఈపాటికి నా తల్లికి హాయిగా పెళ్ళయి, సంసారం చేసుకుంటూ ఎంత కళకళ లాడుతూ వుండును?" అనుకుని బాధపడ్డాడు.

"అమ్మా! నువ్వు లెగమ్మా! నే తిప్పుతా!" వెంకి గానుగ దిగింది. కామరాజు గానుగెక్కాడు.

"వెంకూ" లోపల్నుంచి కేక.

తల్లి నూకాలు దగ్గరికి పరిగెట్టింది.

వెంకికి పెళ్ళీడు దాటిపోతోంది. ఎవరికిచ్చి పెళ్ళిచేస్తాడు. తనలాంటి బీదముఖాల్ని చూసే దెవడు? ఎలాగైన ఆరేడువందలు చేతిలో వుండాలి. ఇంటిమీద తనఖా తెస్తే? గానుగమ్మేస్తే? రెండూ బాగానే తోచాయి.

గానుగ తనకి జీవనాధారం.

ఇల్లు పోతే తనకి నీడే లేదు.

ముసలి గానుగ తిరుగుతోంది. ఆలోచనలు బుర్రలో మెదులుతున్నాయి.

వెంకి దైన్యాక్రాంతమైన ముఖం అతని కళ్ళముందు తాండవిస్తోంది. ఆ అమాయికమైన కళ్ళు ఏవో ప్రశ్నిస్తున్నాయి. తాను మూగగా సమాధాన మిస్తున్నాడు.

ఎవరో తెలగపిండికోసం వచ్చారు. ఎవరో సోలెడునూనె పొయ్యమని వచ్చారు. మరొకరు చారెడు నువ్వులు పెట్టమని వచ్చారు. అందరి కళ్లల్లో మెలగుతూ వెంకి అన్నీ అందించింది.

వీధిలో బండిచప్పుడు వినబడింది. ఇద్దరో ముగ్గురో వ్యక్తుల్లు ఏదో పెద్ద బరువుని మోసుకొచ్చి మంచం మీద పెట్టారు.

ఇల్లంతా ఒక్కసారి గొల్లుమన్నారు. కామరాజు కొటుతిన్నట్టు ఒక్కసారి వెర్రికేక వేసి, మంచంమీద వాలిపోయాడు. వెంకి మంచం మీద కూర్చుని వెక్కి వెక్కి ఏడుస్తోంది. నూకాలు జబ్బుతో వగర్చుకొంటూ ఇవతలికొచ్చింది. తను చూస్తున్న దృశ్యం నమ్మలేకపోయింది.

"బాబూ! ఏం జరిగిందేం జరిగింది?"

"రాయిలాంటి మనిషికిదేం ఖర్మ."

చుట్టు పక్కల జనం పరుగెట్టుకుంటూ వచ్చారు.

"ఏం జరిగింది?"

ఒచ్చిన నలుగుర్లో ఒక పెద్దమనిషి తనకొంపేం మునగనట్టు, "ఏం భయంలేదండి! మిషనులో చెయ్యిపడింది. చక్రాయికి కట్లూ అవి మేమే కట్టించాం. నాలుగురోజుల్లో మాని మళ్లీ పన్లోకి వచ్చేస్తాడు."

కామరాజు కర్తవ్యం తెలీని మూఢునిలా, కళ్ళప్పజెప్పి చూస్తున్నాడు.

చక్రాయి నెమ్మదిగా మూలుగుతున్నాడు. "పళ్ళ చక్రంలో చెయ్యి పడింది ఆదమరుపుగా."

చక్రాయి కళ్లు ఏడుస్తున్నాయి.

తనవాడుకు ఇంతకు పూర్వం పూర్ణాంగుడు! ఇప్పుడో, అంగవిహీనుడు! ఈ మాట తలుచుకొనే సరికి కామరాజు గుండె చెరువైపోయింది. ఫ్యాక్టరీ తన జీవితాన్ని ధ్వంసం చేసింది. ఫ్యాక్టరీలో పని నిరంతర మృత్యువుతో చెరలాటం. ఇక అక్కడున్న బానిసత్వం మరెక్కడా ఉండబోదు. వాళ్ళిచ్చే రూపాయి డబ్బుల్తో ఎనిమిది గంటలూ నిర్విరామంగా, రాత్రనక పగలనక పశువుల్లాగ పనిచెయ్యాలి. ఆ ఎనిమిది గంటలూ కరయుగళానికి నిగళాలే! ఫ్యాక్టరీమీద కామరాజుకి తీరని కోపం వచ్చింది.

"ఛీ! వెధవ ఫాక్టరీ! చచ్చినా వెళ్లొద్దు" కంటికి రెప్పమల్లే మూడురోజులు కాచేరు. గాయం మాన్పులోకి వచ్చింది. తను కూడా ఫ్యాక్టరీ కెళ్ళేడు. ఫ్యాక్టరీ చూచేటప్పటికి కామరాజుకి అయోమయంగా కనిపించింది. రూపాయల కోసం నరుడెలా బానిసగా వ్యవహరిస్తున్నది చూచేడు. బళ్ళమీంచి సరుకుదింపి, మిషన్లో వేసింది మొదలు సరుకు తయారయేదాకా పాటుపడేది అందరూ తనవాళ్ళే. మిల్లు యజమాన్లు కీలు బొమ్మల్లాగ ఉపయోగించుకుంటున్నారు, తన వాళ్ళని. రూపాయి యేం సరిపోతుందని ఊహించారో? ఒక్కదమ్మిడీ హెచ్చించడానికీ, తల ప్రాణం తోకకొస్తుంది. తన కొడుక్కుమల్లే చేతులు నలిగిన వాళ్లను తన కళ్ళ ఎదురుగుండానే చూచాడు. అన్ని

టికి తెగించాలి. అప్పుడేభుక్తి దేనికీ ముందంజ వేయకపోతే ఎలాగడుస్తుంది?

చక్రాయి నెమ్మదిగా కోలుకుంటున్నాడు. ఇప్పుడెవరూ ఫ్యాక్టరీకి పోవటంలేదు.

"అబ్బాయ్! ఫ్యాక్టరీ కెళ్ళకింక. నీ ప్రాణం మీదికే వచ్చింది."

"మానేసేంచేస్తాడు? కూకుంటే తిండెవడెడతాడు? ఉన్నదంతా ఖగలేసింది సాలదూ? రెండేళ్లు పోయాయి. అంతేనా?"

నూకాలు పనిలోకి పోకతప్పదంది. కామరాజు మాట్లాడలేక పొయ్యాడు. మౌనంగా బుద్ధ విగ్రహంలా నుంచున్నాడు.

"వెంకేదే?"

"దానికో తీరుబడేడిసిందేటి? హాయిగా మొగుడితో కాపరం చేసుకోవలసింది. నీళ్లు తేబోయింది."

కామరాజుకి వెంకుమాట వినేసరికి భయం వేసింది. పదిహేడేళ్లు దాటుతున్నాయి. చక్రాయింకా చిన్నవాడే!

"నాన్నో! అక్క పెళ్ళి చెయ్యి. ఎద్దు గానుగమ్మేయ్. ఇంటి మీద డబ్బు తెస్తేసరి"

ఇంతకంటే గత్యంతరం కనిపించలేదు.

వెంకు నీళ్ళ బిందెతో లోపలి కడుగు పెట్టింది. తమ్ముడి మాటలు వింది. తన పెళ్ళి తన తండ్రికెంత విషమ సమస్యగా వుందో గ్రహించింది.

"నా పెళ్ళికిప్పుడేం తొందరొచ్చింది నాన్నా! ఇల్లు వాకిలమ్మేయాలా? తరువాత సూడొచ్చులే"—

"అలా ఊరుకుంటే అవదమ్మా"

"ఏమో నాకిష్టంలేదు. వద్దు నాన్నా"

కామరాజు తన కూతురు మాటలు వింటూ ఉప్పొంగిపోయాడు. ఎంత బుద్ధిమంతురాలు.

ఇంట్లోంచి వెళ్లిపోయిన బావమరిది తిరిగి వచ్చాడు. పూర్వం వేషం మారిపోయింది. సూటూ బూటూ తగిలించాడు.

ఇల్లు చూచి, తెల్లబోయాడు. నూకాల్ని చూచి ఒళ్లు పులకరించింది. తా నిల్లువదిలి రెండు మూడు సంవత్సరాలు కావస్తోంది. తన బావ భ్రష్టుడై కాటికి కాళ్ళు చాచుకు కూర్చున్నాడు. వచ్చేటప్పుడు ఓ వంద రూపాయలు తెచ్చేడు. దానితో ఇల్లు బాగా వెలిగించేసేడు.

"బావా వెంకుకింకా పెళ్ళి కాలేదూ!"

"అంత అదృష్టం ఏడిస్తే బాగానే వుణ్ణు" నూకాలు నిట్టూర్చింది.

కామరాజు కళ్ళు లోతుకు దించుకుపోయాయి. బావమరది మంగయ్య కృతజ్ఞతగా నిట్టూర్చాడు. నూకాలు కేసి తిరిగి "మీ పుట్టింటోళ్ళు సాయం చెయ్యలేదూ?"

నూకాలు పుట్టింటివాళ్ళు డబున్నవాళ్లే. కామరాజు కష్టకాలంలో ఒక్క దమ్మిడీ, సాయం చేయలేదు!

"ఇక ఊరూరా అడుక్కోవాలి" నూకాలు బాధపడుతూ అంది.

బావమరిది మంగయ్య ధైర్యం చేశాడు.

"వెంకమ్మను నాకిచ్చి పెళ్ళి చేయండి"

నూకాలు ముఖం అటు వైపు తిరిగింది. ప్రశ్నార్థకంగా మంగయ్య అందరివైపు చూశాడు. కామరాజుకి మంగయ్య సంబంధం ఇష్టంలేదు. నూకాలుకి భయంగా వుంది అతని కివ్వడానికి. మంగయ్య తల్లి యౌవనంలో వ్యభిచారం తల కట్టుగా జీవితాంతరం వ్రాసింది. అతని కిస్తే సంఘంలో కామరాజుకి భంగం తప్పదు. నలుగురూ ఆడిపోసుకుంటారు. కాని ప్రస్తుత పరిస్థితిని బట్టి పెళ్ళి చెయ్యక తప్పదు. ఆఖరికి తుమ్మ మొద్దునన్నా తెచ్చి, పెళ్ళి చేయాలిసిందే!

"అలాగే" అని ఎలాగో అనగలిగాడు. కామరాజు. నూకాలు నిట్టూర్చింది.

వెంకు పెళ్ళయిపోయింది. మంగయ్య, చక్రాయి ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారు.

కామరాజు నూనె గానుగ కిర్రులు రోజూ వినిపిస్తూనే వుంటున్నయ్. గానుగతో పాటే రోజులు కూడా తిరుగుతున్నాయ్.

డబ్బువల్ల ఏపనైనా సాధించవచ్చునని చాలామంది అభిప్రాయం. అంటే వాళ్లు డబ్బుకోసరం ఏం చేయడానికైనా వెనుదీయరన్న మాట—హాలిఫాక్స్.